# పాడె

ఎండ మితిమాలంగా కాస్తా ఉండది. తిరపతి నుంచి బస్సులో వచ్చి పేటలో దిగేటప్పటికి నా పని సాలయిపొయ్యింది. భలే ఉమ్మంగిం చేస్తా ఉండది. సెమటకు ఒళ్ళంతా తడిసి ముద్దయి పొయ్యింది. దప్పిక్కి నాలికి పిడసగట్టకపోతా ఉంటే బస్సు దిగ్గానే ఆసోబోసో అంటా పొయ్యి గుత్తేతి సల్లాయిన సోడా అంగిడి కాడ గోలీసోడా ఒకటి తాగేసినా! ఆ దెబ్బతో పొయ్యే ప్రాణం లేసొచ్చినంత పనైంది. ఈ ఎండకు ఇంటికి బొయ్యినా చేసేదేముండాదిలే అనుకుని రమణడి అంగిడికాడి కట్టబొయ్యి కొంచేపు కూర్చుని లేసి పోదామనుకోని అడుగట్టా వెయ్యబొయినా! ఈలోపలిట్టా తిరిగి జూస్తే సినిమా మారి పోయుండాది. పల్లెటూరి బావ వాల్ పోస్టర్ పూలమాలగూడా ఏసేసి ఉండారు. అదేనయినా సరే! రాతిరికి తొలాటకు పోవాలనుకునేసినా! పల్లెటూరి బావ అనేపాటికి నాకు మాయత్త కూతురు సినమ్మ గెనానికొచ్చింది. అదేందోగాని నాకాయమ్మి అంటే భలే ఇది. మా సినమ్మి ఈ మద్దినే పెద్దమనిషయింది. అసలా యమ్మి నిజం పేరేందో మా కిప్పటికీ తెలవదు. వాళ్ళమ్మ కడుపులో ఆయమ్మి కడతూరి కానుపు కాబట్టి మా కందరికీ సినమ్మే. సినమ్మి ఉన్నట్టుండి గెనాని కొచ్చే పాటికి సినిమాకు మాత్రం రాతిరికి ఆరెట్టయినా గానీలే పోవాలనుకునేసినా!

రమణడి అంగిడి కాడికని నాలుగడుగులు అట్టేసినానో లేదో, పొద్దున మా నాయన అన్న మాట గుర్తుకొచ్చె. బస్సు దిగినోడివి నేరుగా కొంపకు రాకండా అటా పేట్లో అరట్లు కొడతా ఉండేదేంది, భోగమోడి మాదిరిగా ఇంటికి నేనెప్పుడు బొయ్యినా మా నాయన తిట్టే తిట్టది. ఈమాట గెనానికొచ్చే టప్పటికి మా నాయన ఎనకనించి సెప్పుతో కొట్టినట్టనిపించింది. అదేమైనా సరే ఈ పొద్దు మాత్రం యాడికీ పోకండా నేరుగా ఇంటి కాడికి పోవాలనుకునేసినా! తూరుపుగా పోతా ఉండినోడిని లటక్కని ఎడం పక్కకి తిరిగేసినా బస్సు కాడ్నించి. రెండు ఫర్లాంగులు నడిస్తే మా ఊరు. ఇంతలో నాధముని మిఠాయి అంగిడి కాడినుంచి పెద రెడ్డోళ్ళ గోపాలుడు పిలిసినాడు.

'యామైనా సరే' అనుకునేసినాను గాబట్టి ఇంటి కాడ నాకు పనుండాదని జెప్పేసి బిరీన వచ్చేసినా. దోవలో ఉండే గోలీ ఫేక్టరీ కాడ వస్తా ఉండాను. ఈ ఎండకు దుమ్ము ఆవిర్లు బారతా ఉండాది. సేతి గుడ్డెత్తి నెత్తినేసుకుని నడస్తా ఉండాను. ఈయరనలో మా ఊళ్ళోనించి ఆకాసిన ఒకటి సయ్యని సయికి బొయ్యి ఢమ్మని పగిలింది. ఇదేందిరబ్బా మనూర్లో ఆ కాసినలు పైకి లేస్తా వుండాయ్ అని నక్కాగారికి నంత సేపు అనుమానంగా ఉణింది. కొంపదీసి మనూర్లో ఎవరైనా ఉడేసి గొట్టేసినారా యేమో అనిపించింది. సాకలోలమిట్ట కాడికొచ్చుంటా ఊళ్ళోనుంచి పలకలదరువు ఇనబడింది. ఊళ్ళో వుండే ముసిలోళ్ళంతా ఒకొక్కరుగా కండ్లల్లో మెదల్తా ఉండారు. ఆలోచించుకుంటూ ఊరిగెవున్లోకి నొచ్చేసినా. దేశం కాడ జనమంతా ఉండారు. పలకలో మూడు దరువు ఎత్తుకున్నాయి. దేశం కాడ పలకలనేటప్పటికి నా అనుమానమే నిజమై పోయింది. పాపం నరసమ్మ సచ్చిపోయిందే. శాన మంచిదబ్బా ఆయవ్వ! తెల్లారి నేను బొయ్యేటప్పుడు గూడా బాగునిందే... యాందో ఇకారంగా ఆలోచనతో ఇంటికి బొయ్యి సంచిగట్టుకుని బోదా మనుకున్నా. ఈ యరనలోకే పాడిపైకి లేసింది. ఊళ్ళో జనమంతా దేశం కాడనే ఉండారు. ఇపుడు సంచి కట్టుకోని పోకపోతే నష్ట ఏముండాదిలే అనుకోని నేరు ఎళ్ళిపోయినా! ఊరూరుగా జనమంతా కటనలు కట్టుకుని యాడస్తా ఉండారు. నాక్గూడా మనసంతా భలే బాధగా అనిపించింది. పాపం నరసమ్మవ్వ సచ్చిపోయ్యిందే అనుకుంటా తలిట్టాదిప్పి జూస్తే ఆడ నరసమ్మవ్వ పడీ పడీ యాడస్తా ఉండాది. ఇదేందిరబ్బా! నరసమ్మవ్వ గూడా బతికుండాది ఈళ్ళేందో ఎవురికోళ్ళు వాళ్ళింట్లోనోళ్ళు సచ్చిపోయిన మాదిరిగా యాడస్తా ఉండారే, పిల్లా జెల్లా, ముసిలీ ముతకా అనుకున్నాన్నేను. అందరూ ముక్కులు ఎగపీరతా ఉండారు. పాడి కదిలింది. అందురుతో గూడా నేనుగూడా యలబారినా. ఊరి గెవున్లో మల్లకున దగ్గిర పాడి కిందికి దించినారు. ఆయరనదాకా పాడిమీదుండేదెవురో నాకైతే ఏమీ తెలనలే. గబగబాన అందిరి సందుల్లో దూరి పాడి కాడికి పొయ్యినా. పాడిమీద సీనుగు లేదు. ఇదేం దిరబ్బా! నాకైతే భలే ఆశ్చర్యకం ఏసింది. ఎవురు సచ్చినారనబ్బా ఈళ్ళంతా ఈ మాదిరిగాయాడస్తా ఉండారే అనుకున్నా. పాడిమీద చిన్న కొత్త కడవుండాది. దానికి పసుపు, కుంకున, పూలు పెట్టి ముత్తైదువును సింగారించినట్లు సింగారించి ఉండారు. ఈలోపల మా పూరి రెడ్డి పాడి దగ్గిరికొచ్చి 'ఓనా దేవుడో...' అని అరిసినాడు. అప్పుడు నాకు టకీమని మెరుపు మెరిసినట్లు గెనానికొచ్చేసింది నిరుడునించి వానలు పడక రెండు కార్లు పంటలే పండలేదు. 'కప్పసాంగెం' చేస్తే వాన పడతాదని ఎవురో చెప్పినారని మా పూరి రెడ్డి ఈ సాంగెం చేసుంటాడని పించింది. కొత్తకడవలో కప్పను ఏడు బావుల్లో నుంచి ఏడు సెంబులు నీళ్ళు దేవాల. నీళ్ళల్లో కప్పనుంచి అందరూ ఏడస్తా సెర్లో వదిలేస్తే వాన పడతాదని పెద్దోళ్ళు సెపతా ఉంటారు. వానకోసం ఈళ్ళందరి ఏడుపు... ఊరు ఊరంతా ఒకటే ఏడుపు... గుండెలవిసి పొయ్యే మాదిరిగా... ఒకటే ఏడుపు యాడస్తారు తలెత్తి పైకి జూస్తారు. కలికానికైనా సరే యాడా ఒక మబ్బు గూడా లేదు. మార్వాడీ ఓడు మాదిరిగా ఆకాసం నిమ్మళంగా ఉండాది. అంతసేపు నాలో యాదునిందోగాని ఆ ఏడుపు కట్టలు దెంచుకోని వచ్చేసింది. రబా... ఈ దేమ్మా నాయాల్ది ఒక్క గుడ్డ దదువుడు సినుకు లైనా పడగూడదబ్బా అనిపించింది. ఇంకొక పక్క ఎక్కిళ్ళు పుట్టిపోతా వుండాయినాకు.



మునిరత్నం రెడ్డి